
ప్రజాశక్తి
మంగళవారం 5 డిసెంబరు 2023
5
శ్రీకాకుళం



రక్షణ గోడకు శంకుస్థాపన

ప్రజాశక్తి- ఆమదాలవలస

మండలంలోని ముద్దాడపేట వద్ద రూ.50 లక్షలతో నాగావళి నది ఒడ్డున రక్షణగోడ నిర్మాణానికి శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరదల సమయంలో నదీ పరివాహక ప్రాంతాల గ్రామాల్లోని ప్రజలు పడే ఇబ్బందులు వర్ణణాతీతమన్నారు. ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని నిధులను మంజూరు చేసి పనులను చేపట్టామన్నారు. ప్రజల సమస్యలను పరిష్కరించడమే ప్రభుత్వ ధ్యేయమన్నారు. నెల రోజుల్లో పనులను పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో డిసిసిబి డైరెక్టర్ బొడ్డేపల్లి నారాయణరావు, ఇంజినీరింగ్ అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



కవిటి : ఎగసిపడుతున్న సముద్రపు అలలు

పొంచి ఉన్న 'మిచౌంగ్'

- నేడు భారీ వర్షాలు కురిసే అవకాశం
- ఎగసిపడుతున్న అలలు
- తుపానుతో పలు రైళ్ల రాకపోకలు రద్దు
- నేడూ విద్యాసంస్థలకు సెలవు

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

మిచౌంగ్ తుపాను ప్రభావం జిల్లాకు పొంచి ఉంది. తుపాను ప్రభావంతో జిల్లాలో సోమవారం పలుచోట్ల మోస్తరు వర్షాలు కురిశాయి. ఆమదాలవలసలో గరిష్ఠంగా 15.75 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. శ్రీకాకుళంలో 14.25 మి.మీ, ఆమదాలవలస మండలం చింతాడలో 13.25 మి.మీ వర్షం కురిసింది. లావేరు మండలం తామడలో 13 మి.మీ, గార మండలం తూలుగులో 11.75 మి.మీ వర్షం పడింది. సోంపేట మండలం కొర్లాంలో కనిష్ఠంగా 0.25 మి.మీ వర్షపాతం నమోదైంది. తుపాను ప్రభావంతో సముద్రంలో అలలు ఎగసిపడుతున్నాయి. మంగళవారం భారీ వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణశాఖ హెచ్చరికలు జారీ చేసింది. దీంతో రైల్వే శాఖ జిల్లా మీదుగా నడిచే పలు రైళ్లను రద్దు చేసింది. జిల్లాకు భారీ వర్షాల హెచ్చరికల నేపథ్యంలో మంగళవారమూ విద్యాసంస్థలకు సెలవు ప్రకటించారు.

మిచౌంగ్ తుపాను నేపథ్యంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి జిల్లా ఉన్నతాధికారులతో సోమవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. తుపాను వల్ల జిల్లాలో ప్రాణ, ఆస్తి నష్టం సంభవించకుండా అధికారులు ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ముఖ్యమంత్రి వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ జిల్లాలోని తీర ప్రాంత మండలాల అధికారులు, ఫ్రంట్ లైన్ అధికారులతో మాట్లాడారు. తుపాను ప్రభావంతో జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని చెప్పారు. అధికారులు అప్రమత్తంగా ఉండాలని, సత్వరమే చర్యలు చేపట్టేలా ముందస్తు ప్రణాళికతో సిద్ధంగా ఉండాలని సూచించారు. వరి కోతలు కోయరాదని ముందుగానే హెచ్చరించామని, భారీ వర్షాలు కురిస్తే ఆహార పంటలకు నష్టం వాటిల్లకుండా చర్యలు తీసుకోవాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో ఎస్‌పి జి.ఆర్ రాధిక, జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్, అసిస్టెంట్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా, ఇన్‌ఛార్జి డిఆర్‌ఒ జయదేవి, జిల్లా వ్యవసాయ అధికారి కె.శ్రీధర్, వంశధార ప్రాజెక్టు ఎంఎవి డోల తిరుమలరావు ఇతర అధికారులు పాల్గొన్నారు.

విద్యాసంస్థలకూ నేడూ సెలవు

తుపాను ప్రభావంతో భారీ వర్షాలు కురుస్తాయన్న వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో మంగళవారమూ పాఠశాలలు, జూనియర్ కళాశాలలకు సెలవు ప్రకటిస్తున్నట్లు కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సెలవుకు బదులుగా ఈనెల తొమ్మిది లేదా పదో తేదీన పని దినంగా ఉంటుందని తెలిపారు.



ఆమదాలవలస : వ్యవసాయాధికారి మోహనరావు ఆధ్వర్యాన రైస్‌మిల్లుకు తరలిస్తున్న ధాన్యం బస్తాలు

మిల్లులకు ధాన్యం తరలింపు

నూర్పులు పూర్తయిన ధాన్యం తడిచిపోయి రైతులు నష్టపోకుండా అధికారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నారు. వ్యవసాయ, ఆర్‌బికె అధికారులు గ్రామాల్లో పర్యటించి నూర్పులు పూర్తి చేసిన ధాన్యం తరలింపునకు చర్యలు చేపడుతున్నారు. ధాన్యం బస్తాలను సమీప మిల్లులకు అధికారులు తరలించారు. మారిన వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో రైతులు కోత కోసిన పంటను కుప్పలు పెట్టుకున్నారు. టార్పాలిన్లు కప్పి పంటను భద్రపరుచుకున్నారు. మరికొన్నిచోట్ల నూర్పులు చేశారు.

విద్యుత్‌శాఖ కంట్రోల్‌రూమ్‌ల ఏర్పాటు

తుపాను నేపథ్యంలో జిల్లాలో విద్యుత్ డివిజన్ కార్యాలయాల్లో కంట్రోల్‌రూమ్‌లను ఏర్పాటు చేసినట్లు ఎపిఇపిడిసిఎల్ పర్యవేక్షణ ఇంజినీర్ ఎన్.కృష్ణమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. నివాస ప్రాంతాల్లో విద్యుత్ వైర్లు కిందపడినా, స్తంభాలు విరిగినా, వంగినా, ట్రాన్స్‌ఫార్మర్ ఫ్యూజు బాక్సులు ప్రమాదకరంగా ఉన్నా తక్షణమే కంట్రోల్‌రూమ్ నంబర్లకు తెలియజేయాలని కోరారు. శ్రీకాకుళం సర్కిల్ కార్యాలయం 9490612633, శ్రీకాకుళం డివిజన్ కార్యాలయం 9440635529, టెక్కలి డివిజన్ కార్యాలయం 9490610050, పలాస డివిజన్ కార్యాలయం 7396615568, సెంట్రలైజ్డ్ కాల్ సెంటర్ టోల్‌ఫ్రీ నంబరు 1912 నంబర్లకు ఫోన్ చేయాలని వినియోగదారులను కోరారు. తుపాను దృష్ట్యా జిల్లాలో తక్షణ విద్యుత్ సరఫరా పునరుద్ధరణ చర్యల నిమిత్తం 13,033 విద్యుత్ స్తంభాలు, 421 కిలోమీటర్ల కండక్టర్లు, 961 ట్రాన్స్‌ఫార్మర్లు సిద్ధం చేసినట్లు తెలిపారు. 750 మంది విద్యుత్ కార్మికులను 70 బృందాలుగా విభజించి సమస్యాత్మక ప్రాంతాలకు పంపించామని పేర్కొన్నారు. 1400 మంది విద్యుత్ సిబ్బంది పునరుద్ధరణ చర్యలకు సిద్ధంగా ఉంచామని తెలిపారు.



బూర్జ : కోత కోసి పొలంలో ఉన్న వరి పనలు

వేటకు దూరంగా మత్స్యకారులు

తుపాను నేపథ్యంలో సముద్రం అల్లకల్లోలంగా మారింది. అలలు ఎగిసి పడుతున్నాయి. చేపల వేటకు వెళ్లొద్దని మత్స్యకారులకు అధికారులు సూచించారు. దీంతో వారు ఇళ్లకే పరిమితమయ్యారు. వలలు, పడవలను భద్రపరుచుకున్నారు.



కవిటి : కపాసుకుద్దితీరంలో భద్రపరిచిన పడవలు, వలలు



ఐక్య పోరాటాలతోనే హక్కుల పరిరక్షణ

సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, రైతాంగ, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ కార్మిక, ఉద్యోగ, రైతు సంఘాలన్నీ ఐక్య పోరాటాలు నిర్వహించాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు, సీనియర్ నాయకులు భవిరి కృష్ణమూర్తి పిలుపునిచ్చారు. సిఐటియు జాతీయ నాయకులు పర్సా సత్యనారాయణ శత జయంతోత్సవాల్లో భాగంగా సిఐటియు ఆధ్వర్యాన రెండు రోజుల పాటు నిర్వహించిన జాతీయ సెమినార్ సోమవారంతో ముగిసింది. నగరంలోని సిఐటియు జిల్లా కార్యాలయంలో నిర్వహించిన సెమినార్‌లో వారు మాట్లాడుతూ కార్మికులు, రైతులు, ప్రజలకు, దేశానికి వ్యతిరేకమైన వినాశకర కార్పొరేట్ అనుకూల విధానాలను బిజెపి ప్రభుత్వం దూకుడుగా అమలు చేస్తోందని విమర్శించారు. ఇటువంటి ప్రభుత్వాన్ని అధికారం నుంచి దింపడమే వీటికి పరిష్కారమన్నారు. పోరాటాలకు తలొగ్గి రైతు వ్యతిరేక చట్టాలను మోడీ ప్రభుత్వం రద్దు చేసిందని గుర్తుచేశారు. కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కల్పిస్తామని, విద్యుత్ ప్రైవేటీకరణ బిల్లును వెనక్కి తీసుకుంటామని చేసిన వాగ్దానాలను నెరవేర్చలేదని తెలిపారు. పెట్టుబడిదారుల ప్రయోజనం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎనిమిది గంటల పని దినాన్ని 12 గంటలకు పెంచుతామని ప్రకటిస్తున్నాయని తెలిపారు. గౌరవ వేతనం, కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్, నిర్ణీత కాలపరిమితి ఉద్యోగాల పేర్లతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పర్మినెంట్ ఉద్యోగాలు లేకుండా చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు..

రాష్ట్రంలోని వైసిపి ప్రభుత్వం మోడీ ప్రభుత్వ కార్మిక ప్రజా వ్యతిరేక విధానాల అడుగులకు మడుగులొత్తుతోందని విమర్శించారు. మోడీ ఆదేశాలకు అనుగుణంగా విద్యుత్, సహకార రంగాలను ప్రైవేటీకరిస్తోందన్నారు. విద్యుత్, ఇంటి పన్నులు, రవాణా ఛార్జీలను పెంచి కార్మికులపై భారాలు మోపిందని విమర్శించారు. షెడ్యూల్డ్ ఎంప్లాయిమెంట్ కార్మికుల వేతనాలను సవరించడానికి నిరాకరిస్తోందని, బిల్డింగ్ కార్మికుల సంక్షేమ నిధులను దారిమళ్లించి పథకాలను నిలిపేసిందన్నారు. బిజెపి విషపూరిత మతతత్వ విధానాలను ఎదిరించడానికి అధికార వైసిపి, ప్రతిపక్ష టిడిపి, జనసేన పార్టీలు సిద్ధపడడం లేదని చెప్పారు. ధరలను నియంత్రించాలని, ఆహారం, మందులు, వ్యవసాయ ఉపకరణాలపై జిఎస్‌టి రద్దు చేయాలని, పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్‌పై ఎక్సైజ్ పన్నులు తగ్గించాలని డిమాండ్ చేశారు. కనీస వేతనం నెలకు రూ.26 వేలు నిర్ణయించి అమలు చేయాలన్నారు. అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈనెల 8న నుంచి చేపడుతున్న నిరవధిక సమ్మెకు ప్రజలంతా మద్దతు ఇవ్వాలని కోరారు. ఈనెల 11, 12 తేదీల్లో కలెక్టరేట్ దగ్గర ఆశావర్కర్లు చేపట్టే 36 గంటల ధర్నా జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు కె.నాగమణి, ఎ.మహాలక్ష్మి, కె.కళ్యాణి, కె.సూరయ్య, జి.అమరావతి, బి.ఉత్తర, ఎన్.వి రమణ తదితరులు పాల్గొన్నారు.

జీడి రైతులను ఆదుకోవాలి : ఎంపీ

శ్రీకాకుళం అర్బన్ : జిల్లాలో జీడి మామిడి రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను దృష్టిలో పెట్టుకుని జీడి రైతాంగాన్ని ఆదుకునేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పార్లమెంటు శీతాకాల సమావేశాల తొలిరోజు సోమవారం రూల్ నంబరు 377 కింద జీడిపప్పు సమస్యను లోక్‌సభలో లేవనెత్తారు. శ్రీకాకుళం జిల్లా పలాస-ఉద్దానం ప్రాంతం నాణ్యమైన జీడిపప్పు ఉత్పత్తికి ప్రసిద్ధి చెందిందని తెలిపారు. ఆశించిన స్థాయిలో దిగుబడి రాకపోవడంతో పాటు కనీస మద్దతు ధర లేక రైతులు ఏటా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇతర దేశాల్లో స్థానికంగా ఉత్పత్తి అయిన జీడిపప్పునే కొనుగోలు చేసేలా దిగుమతి సుంకం ఎక్కువగా విధిస్తున్నారని గుర్తుచేశారు. దీన్ని దృష్టిలో పెట్టుకుని మన దేశంలోనూ దిగుమతి సుంకాన్ని పెంచాలని కోరారు. కనీస మద్దతు ధర కల్పించడంతో పాటు రైతులను ఆదుకునేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పలాస ప్రాంతంలో జీడి పరిశోధనా కేంద్రాన్ని ఏర్పాటు చేసి, మరిన్ని ఉత్పత్తులు సాధించేలా రైతులకు సహకారం అందించాలని కోరారు.

వరిలో ఈ జాగ్రత్తలు తప్పనిసరి

ప్రజాశక్తి - శ్రీకాకుళం

మిచౌంగ్ తుపాను ప్రభావంతో జిల్లాలో వర్షాలు కురుస్తున్నాయి. ఈ నేపథ్యంలో వరి పంటకు సంబంధించిన జాగ్రత్తలు తీసుకోవాలని వ్యవసాయశాఖ జిల్లా సంయుక్త సంచాలకులు కె.శ్రీధర్ తెలిపారు. దీనివల్ల నష్టాన్ని నివారించుకోవచ్చని చెప్పారు.

- కోతకి సిద్ధంగా ఉన్న వరి పంటని వర్షాలకు ముందు కోయొద్దు.
- కోసిన పూర్తిగా ఆరని పనలను కుప్పలు పెట్టేటప్పుడు ఎకరాకు 25 కిలోల ఉప్పును పనలపై చల్లుకుంటూ కుప్ప వేసుకోవడం వల్ల నష్టాన్ని నివారించుకోవచ్చు.
- కోత కోసి పొలంలో ఉన్న పనలు వర్షానికి తడిస్తే, గింజ మొలకెత్తకుండా ఉండడానికి ఐదు శాతం ఉప్పు ద్రావణాన్ని పనలపై పడేలా పిచికారీ చేయాలి. ఒకవేళ పొలంలో నీరు నిలిచి ఉంటే పనలను గట్ల పైకి తెచ్చుకొని విడగొట్టి ఉప్పు ద్రావణం చల్లుకోవాలి. వర్షాలు తగ్గి ఎండ రాగానే పనలను తిరగేసి ఎండబెట్టి నూర్చుకోవాలి.
- కళ్లాల్లో ఉన్న ధాన్యాన్ని వర్షానికి తడవకుండా భద్రపరుచుకోవాలి. నూర్చిన ధాన్యం 2-3 రోజులు ఎండబెట్టడానికి వీలు కాకపోతే కుప్పల్లో గింజ మొలకెత్తడమే కాక రంగు మారి చెడు వాసన వస్తుంది. ఇటువంటి పరిస్థితుల్లో నష్టాన్ని నివారించడానికి ఒక క్వింటాలు ధాన్యానికి ఒక కిలో ఉప్పు, 20 కిలోల పొడి ఊక కలిపి ధాన్యం పోగు పెట్టడం వల్ల గింజ మొలకెత్తకుండా, చెడిపోకుండా నివారించుకోవచ్చు. ఎండ కాసిన తరువాత ధాన్యాన్ని ఎండబోసి, తూర్పారాబట్టి నిల్వ చేసుకోవాలి.
- రంగు మారి, తడిచిన ధాన్యం పచ్చి బియ్యం కంటే ఉప్పుడు బియ్యంగా అమ్ముకోవడం వల్ల నష్టాన్ని కొంతవరకు తగ్గించుకోవచ్చు.
- పిగులు పొట్ట, పూత దశలో పైరు ఒకటి నుంచి రెండు రోజుల కన్నా ఎక్కువ రోజులు నీటమునిగితే కంకి పూర్తిగా బయటకు రాకపోవడం పుష్పాల్లో నీరు చేరడం వల్ల ఫలదీకరణ శక్తి కోల్పోయి తాలు, రంగు మారిన గింజలు ఏర్పడతాయి. గింజ రంగు మారకుండా ఉండడానికి లీటరు నీటికి ఒక గ్రాము కార్బెండిజం లేదా రెండు గ్రాముల కార్బెండిజం మరియు మాంకోజెబ్ లేదా ఒక మి.లీ ప్రోపికొనజోల్ మందును పిచికారీ చేయాలి.

పాలు పోసుకునే దశ : ఈ దశలో 2 నుండి 3 రోజుల కన్నా ఎక్కువగా పంట నీట మునిగితే పిండి పదార్థాలు గింజలలో చేరక గింజ బరువు తగ్గి రంగు మారుతాయి. దీంతో దిగుబడి, నాణ్యత తగ్గుతాయి. గింజ రంగు మారకుండా ఉండడానికి లీటరు నీటికి ఒక గ్రాము కార్బెండిజం లేదా రెండు గ్రాముల కార్బెండిజం మరియు మాంకోజెబ్ లేదా 1 మీ.లీ ప్రోపికొనజోల్ మందును పిచికారీ చేయాలి.

- గింజ గట్టి పడే దశ నుంచి కోత దశ చేను పడిపోకుండా ఉండి నిద్రావస్థ కలిగిన రకాల్లో నష్టం తక్కువగా ఉంటుంది. నిద్రావస్థ లేనటువంటి బిపిటి 5204 వంటి రకాలు నీటమునిగితే గింజ మొలక వచ్చి నష్టం ఎక్కువగా ఉంటుంది. నిద్రావస్థ ఉన్న రకాల్లోనూ చేను పడిపోయి వారం రోజుల కన్నా ఎక్కువగా నీట మునిగితే, గింజల్లో నిద్రావస్థ తొలిగి చేను పైనే మొలక వచ్చే అవకాశముంది. దీని నివారణకు ఐదు శాతం ఉప్పు ద్రావణాన్ని చేనుపై పిచికారీ చేయాలి.
- గింజ తోడుకునే, గట్టిపడే దశలో వెన్ను బరువు వల్ల మొక్కలు కొద్దిపాటి గాలి, వర్షాలకే కణుపుల వద్ద విరిగి నేలకి ఒరుగుతాయి. ఇలా పడిపోవడం వల్ల పిండి పదార్థం గింజలకు సరిగా చేరక గింజ బరువు తగ్గడం, తాలు గింజలు ఏర్పడి దిగుబడి తగ్గే అవకాశముంది. పడిపోయిన చేల నుంచి వచ్చే ధాన్యం రంగు మారి, మిల్లింగ్ సమయంలో విరిగిపోయి, బియ్యంపై మచ్చ వచ్చే అవకాశముంది. పడిపోయిన చేలలో యంత్రాలతో కోత కోయడానికి ఎక్కువ సమయం పట్టడం వల్ల కోత ఖర్చు కూడా పెరిగిపోతుంది. నష్ట నివారణకు, పడిపోయిన చేలలో వీలైనంత తొందరగా దుబ్బులను లేపి నిలబెట్టి కట్టలుగా కట్టే చర్యలు చేపట్టాలి.

11, 12న ఆశావర్కర్ల 36 గంటల ధర్నా

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

కనీస వేతనం చెల్లింపు, పనిభారం తగ్గించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 11, 12 తేదీల్లో కలెక్టరేట్ వద్ద 36 గంటల ధర్నా చేపడుతున్నట్లు ఆశావర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు కె.నాగమణి, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డి.ధనలక్ష్మి, జి.అమరావతి తెలిపారు. ధర్నాను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈమేరకు నగరంలోని జిల్లా వైద్యారోగ్యశాఖ కార్యాలయంలో డిఎంహెచ్‌ఒ మీనాక్షిని సోమవారం కలిసి ధర్నా నోటీసును అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆశావర్కర్లకు ప్రభుత్వ ఉద్యోగులతో పాటు అన్నిరకాలైన సెలవులు, రిటైర్మెంట్, గ్రూప్ ఇన్సూరెన్స్, సంక్షేమ పథకాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఆశావర్కర్ల నియామకాల్లో రాజకీయ జోక్యాన్ని తొలగించి, ప్రభుత్వమే నియామకాలు చేపట్టాలని కోరారు. రిటైర్మెంట్ కాలాన్ని 62 ఏళ్లకు పెంచడంతో పాటు రిటైర్మెంట్ బెనిఫిట్స్ కల్పించాలని డిమాండ్ చేశారు. 18 ఏళ్లుగా ప్రజలకు ఆరోగ్య సేవలందిస్తున్నా, ఆశావర్కర్లను ప్రభుత్వం కార్మికులుగా గుర్తించడం లేదన్నారు. తక్షణమే కార్మికులుగా గుర్తించి ఇతర సౌకర్యాలను కల్పించాలని డిమాండ్ చేశారు. 60 ఏళ్లు వచ్చే వరకు పనిచేయించుకుని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ కల్పించకుండానే తొలగించడం సరికాదన్నారు. విధినిర్వహణలో ప్రమాదవశాత్తు, అనారోగ్యంతో చాలామంది ఆశావర్కర్లు అర్ధాంతరంగా చనిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఆశావర్కర్లకు గ్రూప్ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలన్నారు. గిరిజన ప్రాంతాల్లో పనిచేస్తున్న కమ్యూనిటీ హెల్త్ వర్కర్లను ఆశాలుగా మార్పు చేయాలని డిమాండ్ చేశారు. ఆశావర్కర్లను రోజూ విలేజ్ క్లినిక్, సచివాలయాల్లో ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు ఉండాలని, క్లినిక్‌లు క్లీన్ చేయడం, ఒపి వర్క్, అటెండర్ పనులు, రెండుపూటలా రిజిస్టర్‌లో సంతకాలు చేయాలని అధికారులు వేధిస్తున్నారని విమర్శించారు. రికార్డుల నిర్వహణతో పాటు సొంత డబ్బులతో కొనాలని, సంబంధం లేని ఆన్‌లైన్ పనులను సొంత ఫోన్‌తో చేయాలని వేధించడం తగదన్నారు. సెలవుల్లేక అనేక మంది అనారోగ్యాలపాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆశావర్కర్లకు సంబంధం లేని పనులు చేయించడం ఆపాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి సమస్యలు పరిష్కరించాలన్నారు. ఎఎన్ఎం, హెల్త్ సెక్రటరీల నియామకాల్లో ఆశాలకు వెయిటేజి ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా నాయకులు కె.జ్యోత్స్న, ఎస్.సుశీల, ఎస్.కళావతి తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న ఆశా యూనియన్ నాయకులు

పని దినాల లక్ష్యాలను చేరుకోవాలి

డ్వామా పీడీ జి.వి చిట్టిరాజు

ప్రజాశక్తి - మెళియాపుట్టి

పది దినాల కల్పనలో ఫీల్డ్, టెక్నికల్ అసిస్టెంట్లు, ఇసి, ఎపిఒలు సమన్వయం చేసుకుని మండలాలకు నిర్దేశించిన పని దినాల కల్పనలో లక్ష్యాలను శత శాతం చేరుకోవాల్సిందేనని జిల్లా నీటి యాజమాన్య సంస్థ పథక సంచాలకులు జి.వి చిట్టిరాజు స్పష్టం చేశారు. పాతపట్నం, మెళియాపుట్టి, సారవకోట మండలాల్లో పర్యటించిన పీడీ ఆయా మండలాల్లో ఉపాధి హామీ సిబ్బందితో సోమవారం సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాభావ పరిస్థితుల్లో రైతాంగానికి ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా క్షేత్రస్థాయిలో పని కోరిన ప్రతి జాబ్‌కార్డుదారుని ఉపాధి కల్పించాలన్నారు. లేకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. పంట కాలువల పూడికతీత పనులకు ప్రస్తుతం ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. కాలువ పనులు అంచనా, అవసరం మేరకు తక్షణమే వేసి పంపించాలని సిబ్బందిని ఆదేశించారు. అన్ని పంచాయతీల ఫీల్డ్ అసిస్టెంట్లు ఈనెల 20వ తేదీ నాటికి కనీసం 25 రోజుల పని దినాలను పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్దేశించారు. సగటు గరిష్ట కూలి పెరిగే విధంగా కూలీలతో కొలతల మేరకు పనులు చేయించారన్నారు. అనంతరం మెళియాపుట్టి మండలంలోని సుందరాడ పంచాయతీ పరిధి దేశి చెరువు పనులను పరిశీలించారు. పాతపట్నం మండల గ్రామ సచివాలయల సిబ్బంది, వాలంటీర్ల శిక్షణా సమావేశంలో పాల్గొని సిబ్బందికి అవగాహనా తరగతులు నిర్వహించారు. కార్యక్రమంలో ఎపిఒలు టి.రవి, సోమేశ్వరరావు, నారాయణరావు, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



ఉపాధి పనులను పరిశీలిస్తున్న డ్వామా పీడీ చిట్టిరాజు



అగ్రిగోల్డ్ బాధితుల సత్యాగ్రహ దీక్ష

ప్రజాశక్తి - టెక్కలి రూరల్

ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన హామీని నెరవేర్చాలని అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యాన అగ్రిగోల్డ్ సంస్థ బాధితులు సోమవారం సత్యాగ్రహ దీక్ష చేపట్టారు. ఎవరైతే తమకు న్యాయం చేస్తారో వారికే తమ ఓట్లు అని నినాదాలు చేశారు. అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు వి.వి నాయడు మాట్లాడుతూ ఈనెల 4 నుంచి 11వ తేదీ వరకు ప్రతి జిల్లాలో రోజుకు నాలుగు నియోజకవర్గాల్లో సత్యాగ్రహ దీక్షలు చేపట్టనున్నట్లు చెప్పారు. దీక్షకు సిపిఎం, సిపిఐ, జనసేన నాయకులు సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.జయసింహ, జిల్లా కార్యదర్శి పైడి గోవిందరావు, బి.నారాయణరావు, జి.రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

సిపిఎం నుంచి తిరుపతిరావు బహిష్కరణ

శ్రీకాకుళం : సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు టి.తిరుపతిరావును పార్టీ నుంచి బహిష్కరిస్తున్నట్లు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు ఒక ప్రకటనలో తెలిపారు. పార్టీ పద్ధతులకు భిన్నంగా తిరుపతిరావు చాలాకాలంగా వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు. సరిదిద్దడానికి పార్టీ ప్రయత్నించినా దిద్దుకోకపోగా, మరింత క్రమశిక్షణ ఉల్లంఘనకు పాల్పడినందున పార్టీ ప్రాథమిక సభ్యత్వం నుంచి బహిష్కరించినట్లు తెలిపారు.

రేపు మార్కెట్ ఆశీలు వేలం

శ్రీకాకుళం అర్బన్ : శ్రీకాకుళం నగరపాలక సంస్థ పరిధిలోని మార్కెట్, రోడ్డు మార్జిన్స్‌లో 2024-25 ఆర్థిక సంవత్సరానికి ఆశీల వసూలుకు ఏజెన్సీ ఎంపికకు ఈనెల ఆరో తేదీన బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు కమిషనర్ ఓబులేషు ఒక ప్రకటనలో తెలిపారు. బహిరంగ వేలం నగరపాలక సంస్థ కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. వేలంలో పాల్గొనే వారు రూ.పది లక్షల సాల్వెన్సీ రూ.మూడు లక్షల డిపాజిట్ చెల్లించాలని తెలిపారు. బహిరంగ వేలంలో హెచ్చు పాటదారునికి మార్కెట్, రోడ్డు మార్జిన్లలో (7 విలీన గ్రామ పంచాయతీలతో సహా) ఆశీలు వసూళ్ల బాధ్యతలను అప్పగించనున్నట్లు పేర్కొన్నారు. 2024 ఏప్రిల్ ఒకటి నుంచి 2025 మార్చి 31వ తేదీ వరకు ఆశీలు వసూళ్లకు అర్హత పొందగలరని స్పష్టం చేశారు.

సచివాలయాలతో నూతన ఒరవడి

ప్రజాశక్తి- కవిటి


సచివాలయాన్ని ప్రారంభిస్తున్న విజయ, రామారావు

ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సచివాలయ వ్యవస్థ పరిపాలనలో నూతన వరవడి సృష్టించిందని జెడ్‌పి చైర్‌పర్సన్ పిరియా విజయ, ఎమ్మెల్సీ నర్తు రామారావు అన్నారు. కవిటి సచివాలయం-3 నూతన భవనాన్ని చిన్నఎర్రగోవిందపుట్టుగలో సోమవారం ప్రారంభించారు. అనంతరం నిర్వహించిన సభలో మాట్లాడుతూ పాలనలో ప్రజలను మమేకం చేసి, సత్వరమే ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం సచివాలయం వ్యవస్థ తీసుకువచ్చినట్టు తెలిపారు. అనంతరం గ్రామంలో పార్టీ జెండా ఆవిష్కరించి, పంచాయతీలో అమలు చేసిన సంక్షేమ పథకాల ఛార్ట్‌ను విడుదల చేశారు. ఇంటింటికీ వెళ్లి మళ్లీ జగనే ఎందుకు కావాలి కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపిపి ప్రతినిధి కడియాల ప్రకాష్, సర్పంచ్ పూడి లక్ష్మణరావు, ఎఎబి చైర్మన్ దువ్వు కృష్ణారెడ్డి, ఎంపిటిసి పూడి నీలాచలం, కో-ఆప్షన్ మెంబర్ పాండవ శేఖర్, బెందాళం రమణమూర్తి, జల్లు యుగంధర్, దుద్ది ధర్మారావు, ఇఒ వీరభద్రస్వామి పాల్గొన్నారు.


పాఠ్య పుస్తకాలతో విద్యార్థులు

ఐఐటి పాఠ్య పుస్తకాల పంపిణీ

పలాస: మండలంలోని నీలావతిలో ఉద్దాన ప్రాంత విద్యాభివృద్ధి వేదిక ఆధ్వర్యాన 6, 7,8 తరగతులు చదువుతున్న విద్యార్థులకు ఐఐటి ఫౌండేషన్ కోర్సు పాఠ్య పుస్తకాలను సోమవారం పంపిణీ చేశారు. ఆ కోర్స్‌కు సంబంధించిన మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, పుస్తకాలను అందజేశారు. కార్యక్రమంలో యువివి అధ్యక్షులు ఇసాకోట జోగారావు, ప్రధాన కార్యదర్శి బొడ్డు చిన్నారావు, గ్రంథాలయ నిర్మాణ కమిటీ కన్వీనర్ కుత్తుం ప్రకాశరావు, గౌరవ ఉపాధ్యక్షులు పోతనపల్లి గీతమ్మ, ఆర్థిక కార్యదర్శి ఎంపల్ల కామేశ్వరరావు, పూర్వ అధ్యక్షులు తెప్పల వాసుదేవరావు, అకాడమిక్ సెల్ కన్వీనర్ పి.బాలరాజు పాల్గొన్నారు.


విగ్రహం వద్ద నివాళ్లర్పిస్తున్న జగన్మోహనరావు, తదితరులు

చిరస్మరణీయుడు ఘంటశాల

శ్రీకాకుళం అర్బన్ : తన గాత్రంతో ప్రజల మనస్సుల్లో చెరగని ముద్ర వేసుకున్న గాయకులు ఘంటశాల వెంకటేశ్వరరావు అని, తెలుగుజాతి ఉన్నంత వరకు ఆయన చిరస్మరణీయునిగా ప్రజల హృదయాల్లో నిలుస్తారని రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు అన్నారు. సోమవారం ఘంటశాల ఆరాధ ఉత్సవ కమిటీ ఆధ్వర్యాన నగరంలోని బాపూజీ కళామందిర్ 101వ జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాట ఉన్నంత కాలం ఆయనకు ప్రజల్లో చోటు ఉంటుందని చెప్పారు. ఉత్సవకమిటీ కన్వీనర్ నిక్కు అప్పన్న మాట్లాడుతూ చలనచిత్ర రంగంలో ఆయన అగ్రబాగాన నిలిచారన్నారు. కార్యక్రమంలో సంగీత విద్వాంసులు బండారు రమణమూర్తి, నిక్కు హరి సత్యనారాయణ, రామలింగ స్వామి, కామేశ్వరరావు, డాక్టర్ లక్ష్మీనారాయణ, సూర్య ప్రసాదరావు, మూర్తి, మల్లెమొగల రాజు పాల్గొన్నారు.

ఆపద సమయంలో ఆ నలుగురు

సామాజిక సేవలో స్వచ్ఛంద సంస్థలు

ప్రజాశక్తి- కవిటి

ఎక్కడో పుట్టి... ఎక్కడో పెరిగిన వారిని కొన్ని అనుకొని సంఘటనలు అనునిత్యం కలిసేలా చేస్తున్నాయి. సొంత లాభం కొంతమానుకుని పొరుగువానికి సాయపడవోయ్... దేశమంటే మట్టికాదోయ్ దేశమంటే మనుషులోయ్... అన్న గురజాడ కవితను అవుపోసన పట్టిన ఆ నలుగురు ఏకమవుతున్నారు. ఆపద సమయంలో తాము అనుభవించిన వేదన, తమ కుటుంబ నేపథ్యం, సామాజిక పరిస్థితులు చూసి చలించిపోయి తమలా మరొకరు బాధపడకూడదనే దృఢ సంకల్పంతో చేయిచేయి కలుపుతున్నారు. ప్రతీ గ్రామంలోనూ స్వచ్ఛంద సంస్థలుగా ఏర్పడుతున్నారు. ఆపద అంటే సరే పద అంటూ ఆర్తులకు అండగా నిలుస్తున్నారు. కష్టం వచ్చిందని తెలిస్తే కన్నీరు కారుస్తూ కూర్చోకుండా చేయిచేయి కలిపి ఆ కష్టానికే కన్నీరు తెప్పిస్తున్నారు.

కీలకపాత్ర పోషిస్తున్న స్వచ్ఛంద సంస్థలు

ఇటీవల కాలంలో ఎక్కడ ఎటువంటి సంఘటన జరిగినా, ఎవరు ఆపదలో ఉన్నారని తెలిసినా వారికి అండగా నిలిచేందుకు స్వచ్ఛంద సంస్థలు సిద్ధంగా ఉంటున్నాయి. ప్రతి గ్రామంలోనూ స్వచ్ఛంద సంస్థ సభ్యులు ఉంటూ తమ పరిధిలో ఉన్న సమాచారం సంస్థకు తెలియజేస్తున్నారు. ముఖ్యంగా హెల్పింగ్ హేండ్స్, మాతృమూర్తి యువజన సంఘం, డాక్టర్ అబ్దుల్ కలామ్ ఫౌండేషన్, ఎస్‌జిఎఫ్, అన్నవరం హెల్పింగ్ హేండ్స్, జైహింద్ ఫౌండేషన్, రక్షణ ఫౌండేషన్, పవన పుత్ర సేవా సమితి, ఉద్దానం ఫౌండేషన్, సిక్కోలు ఉద్దానం సేవా సమితి, ఆ నలుగురు, మృత్యుంజయ ఫౌండేషన్, సీతయ్య ఫౌండేషన్ తదితర స్వచ్ఛంద సంస్థలు విరివిగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ ఆర్తులు, అభాగ్యులకు అండగా నిలుస్తున్నాయి. ఎంతలా అంటే లక్షలాది రూపాయలు ఆర్తులకు అందిస్తూ అమ్మలా ఆదరిస్తున్నాయి.


రక్తదానం చేస్తున్న యువకులు (ఫైల్)

రక్తదానంపై తొలగిన అపోహలు

గతంలో ఒక మనిషి ప్రాణాపాయ స్థితిలో ఉండి రక్తం అవసరమైనప్పుడు రక్తదాత పక్కనే ఉన్నా రక్తం ఇచ్చేందుకు ముందుకు వచ్చేవారు కాదు. తాము రక్తం ఇస్తే తాము అనారోగ్యానికి గురవుతామని, రక్త దానం అనేది మంచి పద్ధతి కాదనే అపోహ అప్పట్లో వారిలో బలంగా నాటుకుపోయింది. కానీ, ప్రస్తుతం పరిస్థితి మారింది. స్వచ్ఛంద సంస్థలు, సామాజిక స్పృహ మెండుగా ఉన్న యువతరం విరివిగా రక్తదాన శిబిరాలు నిర్వహిస్తున్నారు. ఏ ఆస్పత్రిలో రక్తం కోసం రోగులు ఎదురుచూస్తున్నారని తెలిసినా వెంటనే అక్కడికి వెళ్లి రక్తదానం చేస్తున్నారు. అంతేకాకుండా గ్రామాల్లో రక్తదానంపై ఉన్న అపోహలు తొలగించి, రక్తదానం చేయాలని యువతని ప్రోత్సహిస్తున్నారు.

చిన్ని గుండెకు... పెద్ద స్పందన

మండలంలో ఎల్‌హెచ్‌ఎల్ అనే అరుదైన వ్యాధితో బాధపడుతున్న 9 నెలల చిన్నారి ఆద్య దయనీయ పరిస్థితి వివరిస్తూ ఆగస్టు 15న ప్రజాశక్తి 'చిన్ని గుండెకు పెద్ద కష్టం' అంటూ కథనాన్ని ప్రచురించింది. ఈ కథనానికి అటు స్వచ్ఛంద సంస్థలు, ఇటు యువతరం నుంచి అనూహ్య స్పందన లభించింది. ఎంతలా అంటే కేవలం పది రోజుల్లోనే పాప వైద్యానికి అవసరమైన 18 లక్షలు దాతలు అందించారు. ఇందులో స్వచ్ఛంద సంస్థలు, నేటి యువతరం పాత్ర నభూతో నభవిష్యత్ అనేలా సాగింది.


చిన్నారి వైద్యానికి ఆర్థికసాయం అందజేస్తున్న యువకులు (ఫైల్)

కొన్ని కన్నీటి గాథల నుంచి పుట్టిన ఆలోచన

2013లో నేను పదో తరగతి చదివినప్పుడు వలస కూలీగా ఉన్న మా గ్రామానికి చెందిన వ్యక్తి అండమానులో కొబ్బరి చెట్టుపై నుంచి పడి తీవ్రంగా గాయపడ్డాడు. అప్పుడు అతని ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రమే అవడంతో మా స్నేహితులమంతా కలిసి రూ.25 వేలు అందించాం. అదే మేము ఒక సంస్థగా ఏర్పడితే ఇలాంటి ఎంతో మందికి అండగా నిలవచ్చనే ఆలోచన ఏర్పడింది. ఇప్పుడు 220 మంది సభ్యులుగా ఉన్నారు. ఇప్పటివరకు రూ.ఆరు లక్షల వరకు దాతలకు సాయం రూపంలో అందించగా, సుమారు 500 యూనిట్ల రక్తదానం చేశారు.

- కాళీ సాహు, హెల్పింగ్ హాండ్స్ హేండ్స్ సభ్యుడు

రైళ్ల రద్దుతో బోసిపోయిన రైల్వేస్టేషన్


ప్రయాణికులు లేక బోసిపోయిన రైల్వే ప్లాట్‌ఫారం

ప్రజాశక్తి- ఆమదాలవలస

రాష్ట్రంలో మిచౌంగ్ తుఫాను ప్రభావంతో రైల్వే అధికారులు ముందస్తుగా పలు రైళ్లను రద్దు చేశారు. శ్రీకాకుళం రోడ్డు రైల్వేస్టేషన్ నుంచి అటు భువనేశ్వర్ వైపు ఇటు విజయవాడ వైపు వెళ్లే రైళ్లను రైల్వే అధికారులు రద్దు చేయడంతో రైల్వేస్టేషన్ ఆవరణ, ప్లాట్ పామ్‌పై ప్రయాణికులు లేక నిర్మానుష్యంగా మారింది. సోమవారం ఉదయం భువనేశ్వర్ నుంచి ప్రశాంతి ఎక్స్‌ప్రెస్ మాత్రమే విజయవాడ వైపు వెళ్ళింది. సాయంత్రం ఫలక్‌నుమ, కోణార్క్ ఎక్స్‌ప్రెస్‌లు మాత్రమే నడుస్తున్నట్లు మిగిలిన రైళ్లు అన్ని రద్దు చేసినట్లు రైల్వే అధికారులు తెలిపారు. రైళ్ల రద్దుతో ప్రయాణికులు ఎవరూ రైల్వేస్టేషన్‌కు రాకపోవడంతో స్టేషన్ పరిసర ప్రాంతాల్లో ఖాళీగా దర్శనం ఇవ్వడంతో రైల్వేస్టేషన్ బోసిపోయింది. మరో రెండు రోజుల పాటు రైళ్లన్ని రద్దు చేసినట్లు రైల్వే అధికారులు తెలిపారు.

శివాజీ పరామర్శ

మందస : మండలంలోని వి.వి.ఆర్.పురం, భిన్నాలమథనాపురాలకు చెందిన టిడిపి నాయకులు కర్రీ ఆనందరావు, మార్పు నాగయ్యలు అనారోగ్యంతో బాధపడుతున్నారు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి గౌతు శివాజీ సోమవారం పరామర్శించి యోగా క్షేమాలు తెలుసుకున్నారు. ఏమైనా అవసరం ఉంటే తమ దృష్టికి తీసుకొస్తే సహాయ సహకారాలు అందిస్తామని భరోసా ఇచ్చారు. ఆయనతో పాటు టిడిపి నాయకులు ఉన్నారు.


పరామర్శిస్తున్న శివాజీ


దుస్తులను పంపిణీ చేస్తున్న సభ్యులు

దుస్తులు పంపిణీ

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

ఇచ్ఛాపురం మున్సిపాలిటీలోని 75 మంది పారిశుధ్య కార్మికులకు లయన్స్ క్లబ్ అధ్యక్షులు లోపింటి నరసింహామూర్తి, కార్యదర్శి తిప్పన లక్ష్మణరెడ్డిలు సోమవారం దుస్తులు, అల్పాహారాన్ని అందజేశారు. కార్యక్రమంలో క్లబ్ సభ్యులు బాలకృష్ణ, సుబ్బారావు, బత్తుల వెంకటరమణ, ఉమాశంకర్, గోపీనాథ్‌రెడ్డి, బుజ్జి, సత్యమయ్య, యోగి, రవి, లోహిదాస్ పాల్గొన్నారు.

9న ఆమదాలవలస మండల సమావేశం

ప్రజాశక్తి- ఆమదాలవలస

మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 9న శనివారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనునట్లు ఎంపిడిఒ ఎస్.వాసుదేవరావు తెలిపారు. మండల పరిషత్ అధ్యక్షులు తమ్మినేని శారద అధ్యక్షతన ఉదయం 10 గంటలకు జరగనుందని తెలిపారు. ఈ సమావేశానికి ఎంపిటిసిలు, సర్పంచ్‌లు పాల్గొననున్నారని, అన్ని శాఖల అధికారులు పూర్తిస్థాయి సమాచారంతో విధిగా హాజరుకావాలని ఒక ప్రకటనలో తెలిపారు.


దరఖాస్తు అందజేస్తున్న సభ్యులు

ఓటరు నమోదుపై అవగాహన

వజ్రపుకొత్తూరు: ఓటు హక్కు వజ్రాయుధం వంటిదని ఉద్దానం అభ్యుదయ సేవాసమితి అధ్యక్షులు తామడ లక్ష్మణరావు అన్నారు. మండలంలోని కొమరల్తాడ పంచాయతీలో ఓటు నమోదుపై సోమవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన యువతీ, యువకులకు, ఓటు హక్కు లేని వారికి ఓటు హక్కు ఆవశ్యకతను వివరించినట్లు తెలిపారు. అవగాహన లేక చాలామంది ఓటుకు దూరం అవుతున్నారని అన్నారు. ఓటు హక్కు కలిగిన యువత ఎన్నిక సమయంలో సరైన తీర్పు ఇవ్వడానికి అవకాశం వస్తుందని అన్నారు. ఈ సందర్భంగా 30 మందిని ఓటర్లుగా నమోదు చేయడానికి అవసరమైన ధ్రువీకరణ పత్రాలను ఫారం-6తో పాటు గ్రామ పచాయతీ సెక్రటరీ ఉషకు అందజేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో సేవా సమితి మండల మహేష్, పాపారావు, శ్రీను, విజయ పాల్గొన్నారు.


వివరాలను సేకరిస్తున్న పోలీసులు

నారాయణరెడ్డిపై దాడి

ఇచ్ఛాపురం : పట్టణంలో కాంట్రాక్టర్ గుజ్జు నారాయణరెడ్డిపై గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేసి పరారయ్యారు. ఆదివారం అర్ధరాత్రి సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు సంతపేట నూకలమ్మ ఆలయం వద్ద ఉన్న ఇంట్లోకి ప్రవేశించి కత్తులతో దాడి చేశారు. కుటుంబ సభ్యులు కేకలు వేయడంతో దుండగలు పరారయ్యారు. తీవ్ర రక్తస్రావంతో ఉన్న నారాయణరెడ్డిని హుటాహుటిన స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న పట్టణ పోలీసులు సోమవారం ఉదయం బాధితుడు వద్ద నుంచి వివరాలు సేకరించి కేసు దర్యాప్తు చేస్తున్నారు. వ్యాపార లావాదేవీలు మరే ఇతర కారణాలు వల్ల జరిగిందా అన్న కోణంలో పోలీసులు విచారణ ప్రారంభించారు. పట్టణ ఎస్ఐ గోవిందరావు ఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు.


మాట్లాడుతున్న చైర్‌పర్సన్ రాజ్యలక్ష్మి

వాలంటీర్లు నిర్లక్ష్యం వహించవద్దు

ఇచ్ఛాపురం: ప్రభుత్వం చేపడుతున్న ఎపి నీడ్ జగన్ కార్యక్రమంలో కొంత మంది వార్డు వాలంటీర్లు నిర్లక్ష్యం వహిస్తున్నారని, మరోసారి ఇలా జరిగితే చర్యలు తీసుకుంటామని మున్సిపల్ చైర్‌పర్సన్ పి.రాజ్యలక్ష్మి హెచ్చరించారు. మున్సిపల్ కార్యాలయంలో ఎపి నీడ్ జగన్ కార్యక్రమంపై వార్డు సచివాలయం సిబ్బంది, వాలంటీర్లతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇప్పటివరకు 85 శాతం కార్యక్రమం నిర్వహించామని, మిగతా 15 శాతం కార్యక్రమాల్లో పాల్గొవాలని సూచించారు. కార్యక్రమంలో వైసిపి పట్టణ అధ్యక్షులు బలివాడ ప్రకాశరావు పట్నాయక్, జెసిఎస్ కన్వీనర్ సాలిన ఢిల్లీ, ఎంఎల్ఒ సందీప్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి


మాట్లాడుతున్న శ్రీరామ్మూర్తి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

స్థానిక యుటిఎఫ్ కార్యాలయంలో ముఖ్య బాధ్యుల సమావేశం ఆ సంఘ జిల్లా అధ్యక్షులు ఎల్.బాబూరావు అధ్యక్షతన నిర్వహించారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి బి.శ్రీరామ్మూర్తి మాట్లాడుతూ 39వ జిల్లా కౌన్సిల్ సమావేశాలు కోటబొమ్మాళిలో 3న ఘనంగా జరిగాయని ఈ సందర్భంగా కౌన్సిల్‌లో పలు భవిష్యత్ కర్తవ్యాలు తీసుకోవడం జరిగిందన్నారు. నూతన కమిటీ రాబోయే కాలంలో విద్యారంగ పరిరక్షణ కోసం, జిల్లాలో ఉపాధ్యాయుల సమస్యలపై పనిచేస్తుం దన్నారు. సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి చౌదరి రవీంద్ర, జిల్లా సహాధ్యక్షులు కె. దాలయ్య, బి ధనలక్ష్మి, కోశాధికారి బి.రవికుమార్, రాష్ట్ర కౌన్సిలర్లు పి.అప్పారావు, ఎస్.కిషోర్ కుమార్ పాల్గొన్నారు.

సెప్టిక్‌ట్యాంక్ వాహనం ప్రారంభం


వాహనాన్ని ప్రారంభిస్తున్న చైర్మన్ గిరిబాబు

పలాస : మహిళలకు స్వయం ఉపాధి పొందేలా ప్రభుత్వం చర్యలు చేపట్టడం ఆనందాయకమని పలాస మున్సిపల్ చైర్మన్ బళ్ల గిరిబాబు అన్నారు. పలాసలో పురపాలక సంఘం కార్యాలయం వద్ద ఎస్‌సి కార్పొరేషన్ ఆధ్వర్యాన జాతీయ సఫాయి కర్మచారీ ఫైనాన్షియల్ డెవలప్‌మెంట్ కింద రూ.32 లక్షల విలువ కలిగిన సెప్టిక్ ట్యాంక్ వాహనాన్ని సోమవారం ప్రారంభించారు. రూ.15 లక్షల వరకు రాయితీ ఉంటుందని, రూ.16 లక్షల వరకు లబ్ధిదారునికి రుణం ద్వారా వాహనం అందిస్తున్నామని తెలిపారు. జిల్లాలో పలాసకు మాత్రమే అవకాశం వచ్చిందని, ప్రజలకు చక్కని సేవలు అందించాలని కోరారు. కార్యక్రమంలో బిసి కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఆర్.గెడ్డమ్మ, కమిషనర్ టి.నాగేంద్రకుమార్, బి.సంతోష్‌కుమార్, సఫాయి మహిళా సంఘం సభ్యులు ఎ.వరలక్ష్మి, పురపాలక సంఘం అధికారులు పాల్గొన్నారు.


శిక్షణను పరిశీలిస్తున్న కృష్ణమోహన్

శిక్షణా కేంద్రం పరిశీలన

మెళియాపుట్టి : మండల పరిషత్ కార్యాలయంలో సచివాలయ ఉద్యోగస్తులకు వాలంటీర్లకు రీప్లేస్‌మెంట్ ప్రోగ్రాం సోమవారం ప్రారంభమైంది. ఈ శిక్షణా కార్యక్రమాన్ని పంచాయతీరాజ్ అసిస్టెంట్ కమిషనర్ కృష్ణమోహన్, డిఎల్‌డిఒ అలివేలు మంగమ్మ, పి.శాతవాహన, ఎస్.లలితారాణి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా తగు సూచనలు, సలహాలు ఇచ్చారు. జాబ్ సార్ట్, ఎస్‌డిజి గోల్స్, మెడిటేషన్ సిసి, లీవ్స్ నిబంధనలపై శిక్షణ ఇచ్చారు. రామచంద్ర మిషన్ హార్ట్‌ఫుల్ నెక్స్ టీం ద్వారా శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ పి.చంద్రకుమారి, ఇఒపిఆర్‌డి టి.తారకేశ్వరి, కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.


పార్టీలోకి ఆహ్వానిస్తున్న పరమేశ్వరరావు

కాంగ్రెస్‌తోనే విభజన హామీల అమలు

టెక్కలి: రాష్ట్ర విభజన హామీలను కాంగ్రెస్ పార్టీ మాత్రమే ఆమలుచేస్తుందని కాంగ్రెస్ పార్టీ నాయకులు రాహుల్‌గాంధీ స్పష్టమైన ప్రకటన చేశారని డిసిసి అధ్యక్షులు డాక్టర్ పేడాడ పరమేశ్వరరావు అన్నారు. డిసిసి కార్యాలయంలో ఇచ్ఛాపురం నియోజకవర్గానికి చెందిన చక్రవర్తిరెడ్డి నాయకత్వంలో 12 మంది కార్యకర్తలు సోమవారం కాంగ్రెస్ పార్టీలోకి చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రత్యేక హోదా, విభజన హామీ, విశాఖ ఉక్కు ప్రయివేటీకరించకుండా నిలుపుదల చేయడం వంటి డిమాండ్లను కాంగ్రెస్ పార్టీ పరిష్కరిస్తుందని అన్నారు. మన ఇంటికి రండి కార్యక్రమం పిలుపులో భాగంగా కాంగ్రెస్ పార్టీలోకి చేరుతున్నారని అన్నారు. కార్యక్రమంలో చంద్రశేఖర్‌రెడ్డి, వీరస్వామి, మోహనరావు, కిషోర్, జానకిరావు, శివారెడ్డి పాల్గొన్నారు.

ఆక్రమణ స్థలంలో హెచ్చరిక బోర్డు

కోటబొమ్మాళి: ప్రభుత్వ స్థలాలను ఎవరైనా అక్రమిస్తే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని మండల డిటి ఆర్.మధు, రెవెన్యూ అధికారి శివకుమార్ అన్నారు. టిడిపి రాష్ట్ర అధ్యక్షులు, టెక్కలి ఎమ్మెల్యే కింజరాపు అచ్చెన్నాయుడు, కొత్తపేట టిడిపి నాయకులు ఫిర్యాదుల మేరకు తహశీల్దార్ జామి ఈశ్వరమ్మ ఆదేశాల మేరకు మంగళవారం ఆర్ఐ, విఆర్ఒ, సర్వేయర్‌లు ఆక్రమణదారులు అక్రమించిన ప్రభుత్వ స్థలాన్ని పరిశీలించారు. అది ప్రభుత్వ స్థలంగా గుర్తించి సోమవారం హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారు. ప్రభుత్వ స్థలాలను అక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు ఈ స్థలాల్లో ఇళ్లు, భవనాలు నిర్మించినా వాటిని తొలగించి క్రిమినల్ కేసులు పెట్టడం జరుగుతుందని సూచించారు.


హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేస్తున్న అధికారులు

బిఎల్‌ఒలు అప్రమత్తంగా వ్యవహరించాలి

ప్రజాశక్తి- కవిటి

బిఎల్‌ఒలు అప్రమత్తంగా వ్యవహరించి విధులు నిర్వహించాలని తహశీల్దార్ పి.శేఖర్, ఎన్నికల డిటి శ్రీహరి సూచించారు. తహశీల్దార్ కార్యాలయంలో క్లస్టో డియఎల్ అధికారులు, బిఎల్‌ఒలతో సోమవారం సమీక్షించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మృతి చెందిన వ్యక్తులకు సంబంధించిన ఓట్లు, ఒకే వ్యక్తికి రెండు, మూడు పోలింగ్ కేంద్రాల్లో ఉన్న ఓట్లు క్షేత్రస్థాయిలో పరిశీలించి సరిచేయాలని సూచించారు. 18 ఏళ్లు దాటిన యువతీ యువకులకు పక్కాగా ఓటు హక్కు కలిగి ఉండేలా చూడాలని ఆదేశించారు. సమావేశంలో డిటి రామచంద్రరావు, ఎంఇఒ ధనుంజయ మజ్జి, ఇఒపిఆర్‌డి శివాజీ పాణిగ్రాహి, హెచ్ఒ మాధవీలత, మండల ఇంజినీర్ ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డిటి శ్రీహరి

పిల్లల భవిష్యత్‌తో ఆటలు

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

పసిపిల్లల భవిష్యత్‌తో అంగన్వాడీ కేంద్రాలు అటలాడుకుంటున్నాయి. సోమవరం తుపాను కారణంగా పాఠశాలలు, కళాశాలలకు జిల్లా కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ సెలవు ప్రకటించారు. అయితే అంగన్వాడీ కేంద్రాలకు ఆ సెలవు వర్తించలేదని సర్వత్రా విమర్శలకు దారితీస్తుంది. ఎంతటి వరదలు వచ్చినా ఈదుకుని వెళ్లే కళాశాల విద్యార్థులకు సెలవులు ప్రకటించి చిన్న సమస్య వచ్చినా తట్టుకోలేని పసి పిల్లలకు ఆ సెలవు వర్తించకపోవడం ఏమిటని సర్వాతా ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అయితే తుపాను సమయంలో గ్రామాలకు దూరంగా ఉన్న అంగన్వాడీ కేంద్రాలు, పాఠశాలలకు బాల్యంలో ఉన్న పిల్లలు ఎలా వెళ్లగలుగుతారని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఈ విషయమై ఐసిడిఎస్ పిడి బగాది శాంతిశ్రీ వివరణ అడుగ్గా విపత్తుల సమయంలో అంగన్వాడీ కూడా ఒక పాత్రని ఆమె తెలిపారు. అందుకు అంగన్వాడీ తెరడం విడ్డూరంగా ఉందని, విపత్తుల సమయంలో పౌష్టికాహారంతోనే పిల్లలు జీవనం సాగిస్తారా అని ప్రశ్నిస్తున్నారు.

శ్రీకాకుళంలో పింఛను అందజేత


పింఛను అందజేస్తున్న కావని

కవిటి: మండలంలోని బెజ్జిపుట్టుగకు చెందిన వాలంటీరు పిరియా కావని శ్రీకాకుళం వెళ్లి ఊపిరితిత్తుల వ్యాధితో బాధపడుతున్న వ్యక్తికి పింఛను అందించి ఆదర్శంగా నిలిచింది. పిరియా వెంకటేశం ఊపిరితిత్తుల సమస్యతో శ్రీకాకుళంలోని ఓ ప్రయివేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. వ్యాధి తీవ్రత తగ్గకపోవడంతో కొన్ని రోజులు ఆస్పత్రిలోనే ఉండాల్సి వచ్చింది. దీంతో శ్రీకాకుళం వెళ్లి పింఛను అందించింది. కావని అంకితభావానికి సర్పంచ్ ఎస్.పి.నారాయణ స్వామి, ఎస్.పి.ప్రవీణ్ తదితరులు అభినందించారు.

పథకాలపై అవగాహన అవసరం


కార్డులను పంపిణీ చేస్తున్న ఎంపిడిఒ ఫణీంద్రకుమార్

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

కేంద్ర ప్రభుత్వం రాష్ట్రంలో ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాలపై అవగాహన పెంచుకోవాలని ఎంపిడిఒ ఫణీంద్రకుమార్ అన్నారు. సోమవారం మండలంలో గంగరాం పంచాయతీలో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం దేశ వ్యాప్తంగా పేద ప్రజల కోసం అనేక సంక్షేమ పథకాలను అందజేస్తోందని, వీటిపై గ్రామస్థాయిలో అవగాహన లేకపోవడం వలన లబ్ధి చేకూరడం లేదని ప్రభుత్వం దృష్టికి రావడంతో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు, వాటి ఉపయోగాలు, అర్హుల సమాచారాన్ని వివరించేందుకే ఈ కార్యక్రమాన్ని రూపొందించారని తెలిపారు. కార్యక్రమంలో బిజెపి మండల పార్టీ అధ్యక్షుడు మెట్ట తిరుమలరావు, ఉప్పాడ నర్సింగరావు, ఉప్పాడ శ్యామలరావు, ఉపాధిహామీ క్లస్టర్ జెఇ జి.హరిప్రసాద్ పాల్గొన్నారు.

ప్రపంచ తెలుగు ఉత్సవాలకు 'కుత్తుం'

పలాస : పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లి గూడెంలో ఈ నెల 16, 17వ తేదీల్లో జరగనున్న ప్రపంచ తెలుగు సాహిత్య-కళా ఉత్సవాల్లో పలాస మండలం మాకన్నపల్లికి చెందిన వాగ్గేయకారుడు కుత్తుం వినోద్ పాల్గొననున్నారు. ఈ మేరకు ఆ సంస్థ ప్రోగ్రాం కన్వీనర్ కొల్లి రమావతి నుంచి ఆహ్వానం అందినట్టు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఉత్సవాల్లో తనను భాగస్వామిని చేసినందుకు వినోద్ కృతజ్ఞతలు తెలిపారు.

ఆక్రమణలపై ఫిర్యాదు

ఇచ్ఛాపురం: పట్టణంలో 17 వార్డు పరిధిలోని సంతపేట వద్ద ఉన్న నూకలమ్మ ఆలయం వద్ద చెరువులో అక్రమంగా నిర్మిస్తున్నారని గ్రామస్తులు కర్రీ నాగరాజు అన్నారు. ఈ మేరకు తహశీల్దార్ మీనాదేవిని సోమవారం కలిసి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆక్రమణలను తక్షణమే నిలుపుదల చేయాలని కోరారు. చెరువులు ఆక్రమించుకుంటే వ్యవసాయ పంటకు నీరు కరువు అవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు.

ఆలయాలు కిటకిట

టెక్కలి రూరల్ : మండలంలోని రావివలస ఎండల మల్లిఖార్జునస్వామి అలయ ప్రాంగణంలో కార్తీకమాస మూడు సోమవారం కావడంతో జిల్లా నలుమూలల నుంచే కాకుండా ఒడిశా రాష్ట్రం నుంచి వేలాదిగా యాత్రికులు తరలివచ్చారు. శీర్షాభిషేక దర్శనానికి యాత్రికులు బారులు తీరారు. సర్పంచ్ సర్లాన బాలకృష్ణ, కార్యదర్శి సింహాచలం, ఆలయ ఇఒ జి.ప్రసాదబాబు యాత్రికులకు అసౌకర్యం కలగకుండా పర్యవేక్షించారు. డిఎస్‌పి బాలచంద్రారెడ్డి అధ్వర్యాన సిఐ సూర్యచంద్రమౌళి, ఎస్ఐ రామకృష్ణ పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

కోటబొమ్మాళి: స్థానిక రెడ్డికవీధిలో ఉన్న శ్రీ ఉమామల్లేశ్వర స్వామి ఆలయంలో పెద్ద ఎత్తున యాత్రికులు క్యూ కట్టారు.

ఆమదాలవలస: భక్తుల తాకిడితో శివాలయాలు శివనామస్మరణతో మార్మోగాయి. పట్టణంలోని మెయిన్ రోడ్‌లో ఉన్న ఉమా రామలింగేశ్వర శివాలయానికి వేకువజామున రెండు గంటల నుంచే యాత్రికులులు పోటెత్తారు.

పలుచోట్ల అన్నదానం

ప్రజాశక్తి- రణస్థలం రూరల్

మండలంలో బంటుపల్లి పంచాయతీ కంబాలపేటలో వెలసి ఉన్న శ్రీ ఎండల మల్లిఖార్జున స్వామి ఆలయం వద్ద కార్తీకమాసం మూడవ సోమవారం సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో 5 వేల మందికి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి విచ్చేసిన బిజెపి జిల్లా అధ్యక్షులు నడుకుదిటి ఈశ్వరరావు మాట్లాడుతూ గత 23 ఏళ్లుగా మూడవ సోమవారం అన్నదాన కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ నదుకుటిది రజని, మాజీ సర్పంచ్ పాశపు రామదాసు, కమిటీ సభ్యులు వెలిచేటి సురేష్ కుమార్, సుధాకర్, రాయుడు, రాజశేఖర్, జి.కృష్ణారావు, పి.అప్పలనాయుడు, ఎం.చిన్నరావు, పి.అసిరప్పడు, ఎం.రమణ పాల్గొన్నారు.


అన్నదానం చేస్తున్న ఎన్ఇఆర్

పొందూరు: మండలం రాపాక గ్రామంలో కార్తీకమాసం మూడో సోమవారం పురస్కరించుకొని శివాలయ ఆవరణలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో పరిసర గ్రామాలకు చెందిన వేలాది మంది ప్రజలు హాజరయ్యారు. అలాగే బురిడీ కంచరాం గ్రామంలో ఎస్ఎస్ఆర్ ట్యూషన్ సెంటర్ ఆధ్వర్యంలో పులిహార పంపిణీ చేశారు. కార్యక్రమంలో అసిరి నాయుడు, గోవింద్, కామేశ్వరరావు, ప్రసాద్, విద్యార్థులు పాల్గొన్నారు.


పొందూరు : అన్నదానంలో పాల్గొన్న యాత్రికులు

వికలాంగులకు ప్రోత్సాహం

పలాస : వికలాంగులకు ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని ఎంఇఒ సిహెచ్.శ్రీనివాసరావు అన్నారు. స్థానిక ఎంఆర్‌సి కేంద్రం వద్ద సోమవారం అంతర్జాతీయ వికలాంగులు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా వికలాంగులకు ఆటల పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఇఒ-2 సత్యం, ఉధ్యాయులు రవి, శ్రీనివాస్, సవర ఆనంద్, ఎంఐఎస్ కో-ఆర్డినేటర్ పోతనపల్లి బాలరాజు పాల్గొన్నారు.